## క్లుప్తంగా

### నాణ్యతా ప్రమాణాలు పాటించండి



సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

**ఉరవకొండ:** కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జెడ్పీటీసీ పార్వతమ్మ, ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు సూచించారు. శుక్రవారం పట్టణంలో రూ. 25 లక్షల జెడ్పీ నిధులతో మంజూరు అయిన సీసీ రోడ్ల నిర్మాణాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 25 లక్షలతో పోలీస్‌స్టేషన్ పక్కన, స్టేట్‌బ్యాంకు తదితర ప్రాంతాల్లో రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్, పెన్నహోబిలం మాజీ ఆలయ కమిటీ చైర్మన్ అశోక్, అంగదాల ఆంజి, వడ్డే ఆంజినేయులు పాల్గొన్నారు.

### బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు

**కూడేరు:** రేషన్‌కార్డు దారుదాలకు అందించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శేషారెడ్డి , సీఎస్‌డీటీ లక్ష్మీదేవి హెచ్చరించారు. శుక్రవారం కూడేరులోని తహసీల్దార్ కార్యాలయంలో వారు మండలంలోని డీలర్లు ఎండీయూ ఆపరేటర్లతో రేషన్ సరుకులకు పంపిణీపై సమీక్షించారు. 15 వరకు కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**కూడేరు:** ఉపాధ్యాయులు సూర్యచంద్రారెడ్డి, మల్లయ్య విద్యార్థుల విద్యాభివృద్ధికి , పాఠశాల అభివృద్ధికి అందించిన సేవలు అమోఘమని తల్లిదండ్రులు, వక్తలు కొనియాడారు. కూడేరు మండల పరిధిలోని జయపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయిన వారిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు చంద్రశేఖర్, సాయి కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య



మృతుడు మల్లికార్జున గౌడ్

**బ్రహ్మసముద్రం :** కన్నేపల్లిలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు వివరాల మేరకు..గ్రామానికి చెందిన కె.పి .మల్లికార్జునగౌడ్(49) కొంత కాలంగా బళ్లారిలో నివాసం ఉంటున్నాడు. అయితే గ్రామంలో తనకు ఉన్న 14 ఎకరాల పొలంలో పంటలు సాగు చేసేవాడు. కొంత కాలంగా పంటలు దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయాడు. గురువారం రాత్రి 11.00 గంటలకు మద్యం సేవించి గ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో ఇంట్లో ఉన్న పత్తి పంటకు పిచికారీ చేసే పురుగుల మందు తాగాడు. గమనించిన అన్నదమ్ములు అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### వ్యక్తికి తీవ్ర గాయాలు

**కూడేరు:** మండల పరిధిలోని అరవకూరు సమీపంలోని అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉరవకొండ మండలానికి చెందిన అఖిల్ తీవ్రంగా గాయపడ్డారు. అఖిల్ ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళ్తుండగా.. అనంతపురం నుంచి ఉరవకొండకు వెళుతున్న కారు అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### క్విజ్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

**కళ్యాణదుర్గం రూరల్:** ఆర్బీఐ ఆధ్వర్యంలో ఇటీవల అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్‌లో కళ్యాణదుర్గం మోడల్ స్కూల్ చెందిన విద్యార్థులు స్వాతి, జ్యోత్స్న మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. వీరు ఈనెల 14 విశాఖపట్నంలో జరుగబోయే రాష్ట్ర స్థాయి క్విజ్‌లో పాల్గొంటారన్నారు. శుక్రవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ తోపాటు అధ్యాపకులు అభినందించారు.

# ఆర్బీకేల వద్ద పంటల బీమా జాబితా ప్రదర్శన

**రాయదుర్గం రూరల్:** మండల వ్యాప్తంగా 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా జాబితాను ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు ఏఓ మహేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 3లోపు తెలియజేయాలన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద రాయదుర్గం మండలానికి డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. వాతావరణ ఆధారిత బీమా కింద 13,245 సర్వే నంబర్లలోని 32,950.21 ఎకరాలకు రూ.10 కోట్లా 56 లక్షలు , దిగుబడి ఆధారిత బీమా కింద 648 సర్వే నంబర్లలోని 1,145.8 ఎకరాల విస్తీర్ణానికి రూ.1.83 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. మొత్తం 13,893 సర్వే నంబర్లలోని 34,096.01 ఎకరాలకు రూ.12.38 కోట్ల వైఎస్సార్ ఉచిత పంటల బీమా కేటాయించినట్లు తెలిపారు. మండలంలోని జుంజురాంపల్లిలో ఎంపీపీ విద్యావతి, ఎంపీటీసీ సురేష్ , సర్పంచ్ వన్నూరుస్వామి, రేకులకుంట సర్పంచ్ ఎర్రిస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, హనుమంతరాయుడు, కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



జుంజురాంపల్లి ఆర్బీకేలో ప్రదర్శించిన పంటల బీమా జాబితాలో పేర్లు చూసుకుంటున్న రైతులు



పంటల బీమా జాబితా విడుదల చేస్తున్న ఏఓ మహేష్ తదితరులు

**ఉరవకొండ రూరల్:** మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, చీనీ పంటలకు వైఎస్సార్ ఉచిత బీమా మంజూరైనట్లు ఏఓ శుభకర్ తెలిపారు. మొత్తం 2010 ఎకరాలకు సంబంధించి రూ.1,06,39,435 విడుదలైందన్నారు. అలాగే 2022 ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ, బత్తాయి, టమాట పంటలకు సంబంధించిన వైఎస్సార్ ఉచిత బీమాకు సంబంధించిన 9398 మంది లబ్ధిదారుల జాబితాను జూలై 3న ఆర్బీకేల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

**కుందుర్పికి రూ.12.81 కోట్ల పంటల బీమా**

**కుందుర్పి:** మండలంలో 11,500 మంది రైతులకు రూ.12.81 కోట్లు పంటలబీమా మంజూరైనట్లు ఏఓ మహేష్ తెలిపారు. శుక్రవారం ఆయన పంటల బీమా జాబితా విడుదల చేశారు. ఆయా ఆర్బీకేల్లో అర్హుల జాబితా ప్రదర్శించామని ఏఓ తెలిపారు. ఇదిలా ఉండగా వంటల బీమా మంజూరు చేయడంపై అప్పిలేపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ అతావుల్లా రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కదరంపల్లిలో సుమారు 20మంది చీనీ రైతులకు రూ.లక్షల్లో బీమా అందినట్లు రైతులు అంజినరెడ్డి, గోపాల్‌రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

### తమిళనాడు వెళ్లి వేలిముద్రల సేకరణ



వేలిముద్రలు సేకరిస్తున్న వలంటీరు మంజునాథ్

**ఉరవకొండ:** అమ్మఒడి పథకం కింద లబ్ధిదారుల వేలిముద్రలను సేకరించడానికి వలంటీర్ మంజునాథ్ తమిళనాడు వెళ్లారు. ఉరవకొండ 3వ సచివాలయ పరిధిలో సూరి, దీపా దంపతులకు 1వ తరగతి చదువుతున్న కుమార్తె ఉంది. అయితే దీప ఈనెల 15న తన పుట్టినిల్లు అయిన తమిళనాడులోని తిరుపూర్‌కు వెళ్లింది. వలంటీరు మంజునాథ్ అమ్మఒడి పథకానికి సంబంధించి వేలిముద్రలు సేకరించాడానికి విద్యార్థిని తల్లిని సంప్రదించారు. తమిళనాడులో ఉన్నామని చెప్పడంతో ఈనెల 27న తన స్నేహితుడు శేఖర్‌తో కలిసి వలంటీరు తమిళనాడుకు బయలు దేరారు. వేలుముద్రలు తీసుకోని శుక్రవారం తిరిగి ఉరవకొండకు చేరుకున్నారు.

### నేడు పింఛన్ కానుక పంపిణీ

**వజ్రకరూరు:** మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. మండల వ్యాప్తంగా 6,785 మంది లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

### అర్హులకు న్యాయం చేయాలి

**కూడేరు:** జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగానే అందించనున్న గుర్తింపు కార్డుల జారీలో అర్హులకు అన్యాయం జరగకూడదని ట్రైనీ కలెక్టర్ కేశవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కూడేరు మండల పరిధిలోని గొటుకూరు సచివాలయాన్ని సందర్శించారు. జగనన్న సురక్ష కింద ప్రజలకు 11 సేవలు ఉచితంగా అందించాలన్నారు. అలసత్వం వహించి ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రైళ్లు నిలపేలా చూడాలని ఎంపీకి వినతి

**యాడికి:** రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చూడాలని వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం అనంతపురంలో ఎంపీ తలారి రంగయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో కరోనా సమయం నుంచి ముంబై- చెన్నై, కాచిగూడ, చెంగల్పట్టు రైళ్లు ఆగడం లేదని, దీంతో యాడికి మండలంతో పాటు, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధర్మవరం-మచిలీపట్నం రైలును రాయలచెరువులో ఆపేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రంగయ్యకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# నేటి నుంచి జగనన్న సురక్ష

**రాయదుర్గం రూరల్:** సచివాలయాల వారీగా శనివారం నుంచి 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య ప్రకటించారు. నేటి నుంచి సచివాలయాల వారీగా క్యాంపులు నిర్వహించి, నమోదైన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో 14 సచివాలయాల్లో చేపట్టే తేదీలను ఆయన ప్రకటించారు. 1న ఉదయం 9 గంటలకు ఎంపీడీఓ బృందం జుంజురాంపల్లి సచివాలయంలో, తహసీల్దార్ బృందం మెచ్చిరి గ్రామ సచివాలయంలో నమోదైన సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. 11 రకాల సేవలను ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

**శెట్టూరు:** మండలంలో శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి, తహసీల్దార్ ఫణికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం మండల స్థాయి అధికారులు 11రకాల సేవలను ప్రజలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు పెరుగుపాళ్యం , 4న కైరేవు-1, 5న కైరేవు -2, 6న బచ్చేహళ్లి , 11న కనుకూరు, 13న చింతర్లపల్లి, 15న యాటకల్లు-2, 18న అయ్యగార్లపల్లి, 20న ములకలేడు, 22న యాటకల్లు-1, 25న శెట్టూరు, 26న లక్ష్మంపల్లి, 27న తిప్పనపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

**శెట్టూరు:** మండలంలో శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి, తహసీల్దార్ ఫణికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం మండల స్థాయి అధికారులు 11రకాల సేవలను ప్రజలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు పెరుగుపాళ్యం , 4న కైరేవు-1, 5న కైరేవు -2, 6న బచ్చేహళ్లి , 11న కనుకూరు, 13న చింతర్లపల్లి, 15న యాటకల్లు-2, 18న అయ్యగార్లపల్లి, 20న ములకలేడు, 22న యాటకల్లు-1, 25న శెట్టూరు, 26న లక్ష్మంపల్లి, 27న తిప్పనపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

**బొమ్మనహాళ్:** మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నుంచి 27 వ తేదీ వరకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షకీలాబేగం శుక్రవారం తెలిపారు. ఎంపీడీఓ , తహసీల్దార్ రెండు బృందాలుగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. 1న నేమకల్లు, 4న కురువల్లి, 6న బొమ్మనహాళ్, 11న ఉంతకల్లు, 13న ఉద్దేహాళ్, 15న శ్రీధరఘట్ట, 18న ఏలంజి, 20న దర్గాహొన్నూరు, 22న గోవిందవాడ, 25న లింగదహాళ్, గోనేహాళ్, 27న బొల్లనగుడ్డం, బండూరు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

**కుందుర్పి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రాధాస్వామి, సచివాలయ మండల కన్వీనర్ రాము కోరారు. శుక్రవారం కరిగానిపల్లిలో సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లకు జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ మమత పాల్గొన్నారు.

**నేడు చాబాలలో 'జగనన్న సురక్ష '**

**వజ్రకరూరు:** మండల పరిధిలోని చాబాల గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. ఇందులో భాగంగానే శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

# ఇసుక దోపిడీదారుడు కాలవే

**కణేకల్లు:** టీడీపీ హయాంలో ఇసుక మాఫీయా చేసింది కాలవ శ్రీనివాసులు, అతని అనుచరులేనని కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ కేశవరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ పెద్దదేవర మాబూపీరా, జేసీఎస్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాలువ మంత్రిగా ఉన్న సమయంలో రచ్చుమర్రి ఇసుకరీచ్ నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రిప్పర్ల ద్వారా బెంగళూరుకు ఇసుక తరలించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. నెలల పాటు దందా చేసిన తర్వాత వారి ట్రిప్పర్లను పోలీసులు పట్టుకొని కేసులు పెట్టారన్నారు. అభివృద్ధి పనుల పేరుతో నిత్యం ఎన్.హనుమాపురానికి ఇసుక తరలిస్తూ అనంతపురం, బెంగళూరుకు కాలవ, అతని అనుచరులు ఇసుక తరలించి రూ.కోట్లు కొల్లగొట్టారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని, ప్రజలు ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కాపు రామచంద్రారెడ్డి వెన్నంటే ఉన్నారని, ఓర్వలేక కాలవ పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి పనులకు ఇసుక వాడుకుంటే ఇసుక దోపిడీ చేస్తున్నారని కాలవ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాము బెంగళూరు గానీ అనంతపురానికి గానీ అక్రమంగా ఇసుక తరలించినట్లుగా రుజువు చేయిస్తారా? అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. తాము అక్రమంగా ఇసుక తరలించలేదని చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేస్తామన్నారు. కర్ణాటకకు ఇసుక తరలించామని మీరొచ్చి ఆలయం వద్ద ప్రమాణం చేస్తారా? అని వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అజ్మతుల్లా, సాధత్, చిన్న సర్మస్, లోకేష్‌రెడ్డి, శివయ్య, జీలాన్, జీ.సుధాకర్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

### నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

**ఉరవకొండ (విడపనకల్లు):** విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులుఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

**కణేకల్లు:** మండలంలోని బెణికల్లులో శనివారం ఉదయం 11 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కన్న, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను విప్ కాపు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

### సజావుగా కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం రూరల్:** మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సజావుగా జరిగింది. ముందుగా అధికారులు అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం కమిషనర్ వెంకటేశులు మాట్లాడుతూ జగనన్న కాలనీలలో మౌళిక సదుపాయాలు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 5,10వ వార్డుల్లో సీసీ, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, కౌన్సిలర్లు అర్చన, హేమావతి, రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యుడు అఫ్జల్, సుధీర్, లక్ష్మణ్, హేమావతి పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎంపీపీ కరణం పుష్పావతి

**ఉరవకొండ (విడపనకల్లు):** విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించి పేదల చదువుకు భరోసా కల్పించిన ఘతన సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి తెలిపారు. అమ్మఒడి నగదు జమచేసినందుకు గాను శుక్రవారం విడపనకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ హనమంతు, నాయకులు కరణం భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ కరణం పుష్పావతి ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

### నిరంతరాయంగా తాగునీరు సరఫరాకు చర్యలు

**రాయదుర్గంటౌన్:** రాయదుర్గం పురపాలక సంఘంలో అత్యంత ప్రాధాన్యత అంశంగా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో నీటి సరఫరాపై వివరణ ఇచ్చారు. ఇటీవల జరిగిన నీటి సరఫరా జాప్యంలో అధికారులు, నీటి సరఫరా విభాగం సిబ్బంది నిర్లక్ష్యం లేదన్నారు. నీటి పంపింగ్ చేసేందుకు రూ.లక్షల విలువైన కొత్త మోటార్లు బిగించడంతోపాటు లీకేజీలను మరమ్మతు చేయించనున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుతో ఇబ్బందులు ఎదుర్కొన్న మాట వాస్తవమన్నారు. కొత్త మోటార్ల ఏర్పాటుతో సమస్య ఉన్న సమయంలో స్టాండ్‌బై మోటార్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం 25వ తేదీ నుంచి పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో తాగునీటి సరఫరా పథకంలో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బందిని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణకు టీమ్‌లుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### ఉపాధి పనుల పరిశీలన

**గుమ్మఘట్ట:** మండలంలోని 75 వీరాపురం గ్రామ సమీపంలో ఉపాధి పనులను ఎంపీడీఓ నరసింహమూర్తి పరిశీలించారు. చెక్‌డ్యాం పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. కూలిగిట్టుబాటు అవుతోందా..? బిల్లులు సక్రమంగా అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈసీ అంజన్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ధనుంజయ, మహిళా మేట్లు పాల్గొన్నారు.

### పరిహారం అందించాలని వినతి

**కుందుర్పి:** మండలంలోని అటవీ ప్రాంతాల్లో అడవి పందులు, ఎలుగుబంట్ల దాడుల్లో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందజేయాలని బాధిత రైతులు శుక్రవారం కళ్యాణదుర్గం రేంజ్ ఆఫీసర్ రామ్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. రెండేళ్లుగా మండలంలో అడవిపందులు, ఎలుగుబంట్ల దాడుల్లో సుమారు 60 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించిన అటవీ, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు నిభందనల ప్రకారం జిల్లా అటవీశాఖకు పరిహారం కోసం నివేదికలు పంపారన్నారు. కాగా నేటికీ తమకు పరిహారం అందలేదన్నారు. రైతులు ఓబన్న, రామాంజనేయులు, ఈరప్ప, రాజశేఖర్, తిప్పేస్వామి ఉన్నారు.

### ఆర్టీసీ బస్సు కింద దూరి మందుబాబు హంగామా



ఆర్టీసీ బస్సు టైరు కింద పడుకున్న వన్నూరుస్వామి

**రాయదుర్గంటౌన్:** తాగుడుకు బానిసై డబ్బులు పోగొడుతున్నాడని తల్లిదండ్రులు, భార్య మందలించడంతో ఓ మందుబాబు హంగామా సృష్టించిన ఘటన శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో జరిగింది. డ్రైవర్‌గా పనిచేసే వన్నూరుస్వామి తాగిన మైకంలో ఏకంగా పాత బస్టాండ్‌లోని ఆర్టీసీ బస్సు టైరు కింద పడుకొని కొద్ది సేపు హంగామా చేశాడు. ఇంట్లో తండ్రి, భార్య తన బైక్, ఫోన్ లాక్కున్నారని, ఇప్పించాలని మొండి పట్టుపట్టాడు. ప్రయాణికులు, డ్రైవర్లు ఎంత నచ్చజెప్పినా వినలేదు. అక్కడే ఉన్న హోంగార్డులు బాబా ఫకృద్దీన్, రఘు నచ్చజెప్పారు. అతని ఇంటికి వెళ్లి భార్య, తండ్రిని పిలిపించి వారి వెంట పంపారు.

## వైభవంగా పాండురంగస్వామి రథోత్సవం



పాండురంగస్వామి



రథోత్సవంలో పాల్గొన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని బళ్లారి రోడ్డులోని స్వకుళిసాళి సమాజ బాంధవుల ఆరాధ్యదైవమైన రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా రెండు రోజుల నుంచి పూజలు నిర్వహించారు. శుక్రవారం రథోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథోత్సవంపై పుర వీధుల్లో ఊరేగించారు. రథోత్సవానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపుభారతి హాజరై పూజలు చేశారు. రథాన్ని బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్ మీదుగా కోటలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం వరకు లాగారు. అక్కడి నుంచి ఓబుళాచారి రోడ్డు మీదుగా రథోత్సవం ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మురళి, సభ్యులు, స్వీట్స్ మర్చంట్స్ యజమాని రేకులకుంట సత్యనారాయణ, కౌన్సిలర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**4 వేల మందికి అన్నదానం**

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని 6వ వార్డు సుబేదార్ బావి వీధిలో వెలసిన పాండురంగస్వామి ఆలయంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఏటా ఆషాఢశుద్ధ తొలి ఏకాదశి పూజలు నిర్వహించిన మరుసటి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం దాదాపు నాలుగు వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బూదూరు జగదీష్, దబ్బాడి సత్యనారాయణ, శాంబమూర్తి, తట్టే నగేష్, దొడగట్ట పాండు, అక్కులప్ప, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**3న గురుపౌర్ణమి వేడుకలు**



షిర్డిసాయిబాబా మూలవిరాట్

**వజ్రకరూరు:** మండల కేంద్రంలోని స్థానిక షిరిడిసాయి ఆలయంలో 3న గురు పౌర్ణమి మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతం, 12 గంటలకు హారతి, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## దశాబ్దాల కల.. నెరవేరిన వేళ..



పూర్తయిన తట్రకల్లు నుంచి ఉరవకొండ రోడ్డు పనులు

**వజ్రకరూరు:** మండలంలోని తట్రకల్లు గ్రామస్తుల దశాబ్దాల కలనేరవేరింది. ఎన్నో ఏళ్లుగా గుంతలు పడిన మట్టి రోడ్డుపైనే అవస్థలు పడుతూ రాకపోకలు సాగించేవారు. ఎన్నో ప్రభుత్వాలు మారిన రోడ్డు గురించి మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. స్థానిక సర్పంచు కురుబ మురిన్ని ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ మూరిన్ని శివలింగ తదితరులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సమస్యను తీసుకెళ్లారు. వై.శివరామిరెడ్డి తక్షణమే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద ఒకటిన్నర కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.62 లక్షల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులు కూడా పూర్తవడంతో తట్రకల్లు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాలు తీర్చిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డితో పాటు స్థానిక నాయకులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

### చంద్రకళ సేవలు మరువలేనివి

**కుందుర్పి:** శీగలపల్లి అంగన్‌వాడీ వర్కర్ చంద్రకళ సేవలు మరువలేనివని సీడీపీఓ వనజా అక్కమ్మ పేర్కొన్నారు. శుక్రవారం చంద్రకళ ఉద్యోగ విరమణ చేయడంతో అప్పిలేపల్లి సెక్టారుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెను పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ గోవిందమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల పాల్గొన్నారు.

### స్టార్టర్ పెట్టెల చోరీ

**కూడేరు:** మండల పరిధిలోని కలగళ్ల గ్రామంలో గురువారం రాత్రి నాలుగు స్టార్టర్ పెట్టెలు అపహరణకు గురయ్యాయి. గోపాల్ , తండా సుగ్రీవ, హరిజన ఎర్రిస్వామి, హరిజన గోవింద్ అనే రైతుల పొలాల్లోని స్టార్టర్ పెట్టెలు చోరీకి చోరీకి గురికాగా. బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### విద్యా కానుక కిట్ల పంపిణీ

**వజ్రకరూరు:** విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గిరిజన గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కె. విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాగులపాడులోని పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందచేశారు. త్రం 180 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు.